

టీడీపీలో భగ్గుమన్న విభేదాలు

టీడీపీలో విభేదాలు భగ్గుమంటున్నాయి. సైదాపురం మండలంలో నేతల మధ్య కోల్డ్‌వార్ జరుగుతోంది. - 8లో



ఈత..కడుపు కోత

ఓ విద్యార్థి సరదాగా ఈతకు వెళ్లి మృతి చెందిన ఘటన చంద్రగిరి మండలంలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. - 8లో



విద్యుత్ షాక్‌తో బాలుడి మృతి

తెగిపడిన విద్యుత్ వైరుపై కాలు వేయడంతో ఓ బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన చిల్లకూరు మండలంలో చోటు చేసుకుంది. - 8లో

న్యూస్‌రీల్

శిక్షణకు 26 మంది డుమ్మా

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శిక్షణకు డుమ్మాకొట్టిన 26 మంది పీఓలు, ఏపీవోలకు సెక్షన్ 134 ప్రకారం షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు రెండు వారాల వ్యవధిలో రెండు సార్లు ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇచ్చామని చెప్పారు. అయితే రెండో సారి నిర్వహించిన శిక్షణకు 4,524 మందికిగాను 4,498 మంది మాత్రమే హాజరయ్యారని, ఇందులో 26 మంది ముందుస్తుగా ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే శిక్షణకు డుమ్మాకొట్టారని వెల్లడించారు. మూడు రోజుల్లో వారు సరైన వివరణ ఇవ్వకుంటే ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ ఖాళీగా ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 76,748 మంది స్వామివారిని దర్శించుకోగా 30,688 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.10 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

డిగ్రీ ఫలితాలు విడుదల

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిధిలో గత ఏడాది డిసెంబర్‌లో నిర్వహించిన డిగ్రీ అన్ని గ్రూపులకు సంబంధించిన ఐదో సెమిస్టర్ ఫలితాలను మంగళవారం విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి దామ్లానాయక్ తెలిపారు. ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్ నందు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచామని ఆయన వెల్లడించారు.

పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ స్లిప్పులు పంపిణీ నిబంధనల మేరకు జరగాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో షేడ్, తాగు నీరు, లైటింగ్, ర్యాంపు, వీల్ చైర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. పీడబ్ల్యూడీ, సీనియర్ సిటిజన్స్ ఓటింగ్ కోసం వెయిటింగ్ లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో పెంచలకిషోర్, జిల్లా నోడల్ అధికారులు, ఎన్నికల సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజు, దానికి ముందు రోజు ప్రింట్ మీడియాలో అభ్యర్థులకు సంబంధించిన రాజకీయ ప్రకటనలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజకీయ ప్రకటనలకు రెండు రోజుల ముందే అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్వేషపూరిత ప్రకటనల కారణంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపడతామన్నారు.

96 శాతం హోమ్ ఓటింగ్

తిరుపతి అర్బన్ : జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లో హోమ్ ఓటింగ్ 96 శాతం పూర్తయింది. 1,139 మంది ఓటర్లు ఉండగా.. అందులో 1,077 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కళ్లుగప్పి కన్నడ మద్యం



పట్టుబడ్డ మద్యం కంటైనర్

ఎన్నికల వేళ జిల్లాలోకి కర్ణాటక మద్యం యథేచ్ఛగా ప్రవేశిస్తోంది. ఓటర్లను మత్తులో ముంచేందుకు సరిహద్దులను దాటి చొరబడుతోంది. ఈ మేరకు అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఎక్కడికక్కడ నిఘాను కట్టుదిట్టం చేసింది. ఈ క్రమంలోనే మంగళవారం బంగారుపాళ్యం వద్ద రూ.లక్షల విలువైన కన్నడ లిక్కర్ తీసుకువస్తున్న ఓ కంటెయినర్ పోలీసులకు పట్టుబడింది. విచారణలో ఈ లోడ్ తిరుపతికి వెళుతున్నట్లు వెల్లడైంది. మద్యం తరలింపు వెనుక కూటమి అభ్యర్థుల హస్తం ఉన్నట్లు తెలిసింది.

- ఏరులా జిల్లాలోకి ప్రవాహం
- చెక్‌పోస్టులను దాటి అక్రమంగా ప్రవేశం
- ఓటర్లను ప్రలోభపెట్టేందుకు యత్నం
- తిరుపతికి తరలిస్తున్న రూ.లక్షల విలువైన లిక్కర్ పట్టివేత
- పోలీసుల అదుపులో నిందితులు
- రవాణా వ్యవహారంలో పూతలపట్టు టీడీపీ నేత హస్తం!
- మద్యం స్మగ్లింగ్‌లో తెరవెనుక కూటమి అభ్యర్థులు?

చిత్తూరు అర్బన్ : ఎన్నికల సందర్భంగా ప్రలోభాల పర్వం మొదలైంది. ఓటర్లకు డబ్బు, మద్యం పంపిణీకి రంగం సిద్ధమైంది. ఇందులో కూటమి అభ్యర్థులు విచ్చలవిడిగా ఓటర్లకు ఎరవేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా మద్యం బాటిళ్లను వెదజల్లి ఓట్లు రాబట్టుకోవాలని యత్నిస్తున్నట్లు సమాచారం. అయితే ఇక్కడి ప్రభుత్వ వైన్‌షాపుల్లో క్వార్టర్ కొనాలంటే కనీసం రూ.130–రూ.150 చెల్లించాల్సి ఉంటుంది. అదే కర్ణాటకలో అయితే కేవలం రూ.35కు టెట్రా ప్యాకెట్, రూ.75కు క్వార్టర్ దొరుకుతోంది. దీంతో చీప్‌గా కన్నడ మద్యం కొనుగోలు చేసి జిల్లాకు అక్రమంగా తీసుకువస్తున్నట్లు తెలుస్తోంది. ఈ స్మగ్లింగ్ వ్యవహారానికి కూటమి అభ్యర్థులు పకడ్బందీ ప్రణాళిక రూపొందించినట్లు సమాచారం.

రూ.లక్షల మద్యం పట్టివేత

ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే లక్ష్యంతో కూటమి అభ్యర్థులు మరింత బరితెగిస్తున్నారు. ఓటర్లకు తాయిలాలతో ఎరవేస్తున్నారు. అందులో భాగంగా కర్ణాటక నుంచి చీప్ లిక్కర్ తెప్పించి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం బంగారుపాళ్యం సమీపంలోని టోల్ గేటు వద్ద ఓ కంటైనర్‌ను పోలీసులు అడ్డుకున్నారు. అందులో పరిశీలిస్తే రూ.43 లక్షల విలువైన కర్ణాటక మద్యం కనిపించింది. నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తే విస్తుబోయే వాస్తవాలు వెలుగుచూశాయి. మద్యం లోడ్‌ను తిరుపతికి తరలిస్తున్నట్లు నిందితులు వెల్లడించారు. ఇందులో కూటమి పార్టీలకు చెందిన నేతలు కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. కర్ణాటకలో తక్కువ ధరకే మద్యం కొనుగోలు చేసి ఇక్కడి ఓటర్లకు పంపిణీ చేయాలని ప్లాన్ వేసినట్లు వివరించారు. ఇందుకోసం కూటమి అభ్యర్థులు తమ పార్టీలకు చెందిన కొందరు నేతలతో కలిసి మొత్తం వ్యవహారం నడిపించినట్లు తెలిసింది ముందుగా బెంగళూరుకు చెందిన ప్రకాష్ అనే వ్యక్తి ద్వారా 713 బాక్సుల కర్ణాటక మద్యాన్ని ఓ కంటైనర్‌లోకి ఎక్కించుకుని నామాల ముని కేశవ (కిరణ్) మరో ఇద్దరు జిల్లాకు బయలుదేరారు. సోమవారం రాత్రి నంగిలి వద్ద ఈ కంటైనర్‌ను పట్టుకోవడానికి పోలీసులు ప్రయత్నిస్తే, తప్పించుకున్నారు. చివరకు బంగారుపాళ్యం వద్ద, కంటైనర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో నిందితులు పరారయ్యేందుకు యత్నించగా పోలీసులు వెంటబడి పట్టుకున్నారు. మద్యం స్మగ్లింగ్‌లో పూతలపట్టుకు చెందిన టీడీపీ నేత హస్తం ఉన్నట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. వీరికి కుప్పం నియోజకవర్గానికి పచ్చ నేత సహకరించినట్లు తెలిసింది. కంటెయినర్‌లోని మద్యంలో కొంత పూతలపట్టులో డంప్ చేసి మిగిలింది తిరుపతి తరలించాలని తమకు ఆదేశాలు అందినట్లు నిందితులు వెల్లడించారు. ఈ మేరకు పోలీసులు పలువురిపై కేసులు నమోదు చేశారు. మద్యం స్మగ్లింగ్‌కు సహకరించిన కారణంగా కుప్పానికి చెందిన తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌పై పోలీసులు కేసు నమోదుచేశారు. అయితే శ్రీనివాస్ పరారీలో ఉన్నట్లు సమాచారం. అలాగే కర్ణాటకలో మద్యం విక్రయించిన బెంగళూరుకు చెందిన డిస్టిలరీ యజమాని, వైన్‌షాప్ ఓనర్, క్యాషియర్‌పై కూడా పోలీసులు కేసులు నమోదు చేశారు.

పట్టుబడిన మద్యం ఆరణిదేనా..?

తిరుపతి తుడా : బంగారుపాళ్యం వద్ద పోలీసులకు పట్టుబడిన కర్ణాటక మద్యం తిరుపతిలో పోటీ చేస్తున్న జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుకు చెందినదనే వార్తలు గుప్పుమన్నాయి. ఎన్నికల సందర్భంగా తిరుపతి ప్రజలను మత్తులో ముంచి ఓట్లు వేయించుకునేందుకే ఆయన రూ.లక్షల విలువైన మద్యం తెప్పిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జనసేన అభ్యర్థిగా ఆరణి తిరుపతిలో అడుగు పెట్టినప్పటి నుంచి జరుగుతున్న పరిణామాలను గమనిస్తే ఆయన అంతటి ఘనుడే అని అర్థమవుతోందని కూటమి నేతలు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. అసంతృప్తి నాయకులకు డబ్బు ఎరవేసి కొనుగోలు చేసిన విషయాన్ని గుర్తుచేసుకుంటున్నారు. రూ.కోట్లు వెదజల్లి, ప్రలోభాలకు గురిచేసి, రౌడీయిజం చేయించి ఈ ఎన్నికల్లో గట్టెక్కాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని చెప్పుకుంటున్నారు. తిరుపతి పవిత్రత దెబ్బతీస్తున్నారంటూ ఎల్లో మీడియాలో నిత్యం నోరేసుకుని పడిపోయే కూటమి నేతలకు ఆరణి ప్రలోభాల పర్వం కనిపించడం లేదా అని స్థానికులు మండిపడుతున్నారు. ఓట్ల కోసం అసాంఘికశక్తులను తిరునగరిలోకి తీసుకువచ్చిన వారికి ఎలా మద్దతు ఇస్తారని ప్రశ్నిస్తున్నారు.



జగన్‌తోనే జనం మెచ్చిన పాలన



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

శ్రీకాళహస్తి(తొట్టంబేడు): జనం మెచ్చిన పాలన వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్సీ, రుష్ హాస్పిటల్ అధినేత డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయం కోసం మంగళవారం ఆయన శ్రీకాళహస్తి మండలం, వెంకటాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపాయి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు పలు రాష్ట్రాలకు ఆదర్శనీయంగా నిలిచాయని కొనియాడారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలకు చేసిన సేవలను గుర్తుచేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు సిపాయి సమక్షంలో పార్టీలో చేరగా, వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సర్పంచ్ రామిరెడ్డి, వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్‌రెడ్డి, చెంగల్రాయరెడ్డి, మునిశేఖర్, మనోహర్‌రెడ్డి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

రెండు రోజుల ముందే మద్యం విక్రయాలకు బ్రేక్

తిరుపతి అర్బన్: ఎన్నికల నేపథ్యంలో ఈనెల 11 సాయంత్రం 7 నుంచి 13వ తేదీ సాయంత్రం 7 గంటల వరకు మద్యం దుకాణాలు మూసివేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తే 9177119097, 9492630970 ఎక్సైజ్ కంట్రోల్ రూమ్ నంబర్లకు సమాచారం అందించాలని ఆయన సూచించారు.

అధికార దాహంతో పేట్రేగుతున్న కూటమి

- ప్యాకేజీ స్టార్‌కు రాజకీయ పరిణితి లేదు
- అవినీతి, అరాచకాలకు బ్రాండ్ అంబాసిడర్ ఆరణి
- 45వ డివిజన్ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే భూమన ధ్వజం



45వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: 'అధికారమే ధ్యేయంగా.. అరాచక పాలనే లక్ష్యంగా.. కూటమి నేతలు పేట్రేగిపోతున్నారు' అని టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ధ్వజమెత్తారు. తిరుపతి 45వ డివిజన్‌లో మంగళవారం కార్పొరేటర్ డాక్టర్ అనీష్‌రాయల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి జగనన్న అందించిన సంక్షేమం, తిరుపతిలో అభినయ్ చేసిన అభివృద్ధిని స్థానిక ప్రజలకు ఆయన వివరించారు. రానున్న ఎన్నికల్లో సీఎంగా జగనన్నను, తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌ని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యే భూమన మాట్లాడుతూ చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌కు అధికార దాహం తప్ప ప్రజాసంక్షేమం అవసరం లేదన్నారు. 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో ఏ ఒక్కరికీ మేలు చేసిన పాపానపోలేదన్నారు. అందుకే ఒంటరిగా ఎన్నికల్లో పోటీచేసే ధైర్యం లేక జనసేన, బీజేపీతో పొత్తుపెట్టుకుని మరోసారి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారన్నారు. చంద్రబాబు ప్రజలకు మంచి చేసి ఉంటే కూటమిగా ఏర్పడాల్సిన అవసరం ఉండేదా? అని ప్రశ్నించారు. పదేళ్లుగా పవన్‌కళ్యాణ్ రాజకీయంలో ఉన్నా కనీస అవగాహనలేక, ప్రజామద్దతు లభించక ఏమి చేయాలో దిక్కుతోచక చంద్రబాబుతో పొత్తు పెట్టుకుని ప్యాకేజీలతో సర్దేస్తున్నారని ఆరోపించారు. రూ.30కోట్లు లంచం తీసుకుని తిరుపతి జనసేన టికెట్‌ను ఆరణి శ్రీనివాసులుకు ఇచ్చారంటే ఎంత ప్యాకేజీ స్టారో అర్థమవుతోందన్నారు.

చిత్తూరు రౌడీయిజం పనికిరాదు

ప్రశాంతమైన తిరుపతి పుణ్యక్షేత్రంలో కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు చిత్తూరు రౌడీయిజాన్ని తీసుకొచ్చి అరాచకాలు సృష్టిస్తున్నాడని ఎమ్మెల్యే భూమన మండిపడ్డారు. చిత్తూరులో ఆరణి జీవితం అవినీతి, అరాచకాలతో నిండిందని, అక్కడ దోచుకుని, దాచుకున్న డబ్బుల్లో రూ.30 కోట్లు పవన్‌కళ్యాణ్‌కు లంచంగా ఇచ్చి తిరుపతిలో జనసేన టికెట్ తెచ్చుకున్నారని ఆరోపించారు. చిత్తూరులోని ప్రజలకు చిన్నపాటి మేలు కూడా చేయలేదని తమ నాయకుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆరణికి టికెట్ ఇవ్వలేదని గుర్తుచేశారు. తిరుపతి ప్రజలు భూమన కుటుంబానికి ఇస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక తమపై నోటికి వచ్చిన ఆరోపణలు చేస్తున్నాడని మండిపడ్డారు. దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్లు తిరుపతిలో కూటమి పేరుతో అందరూ ఒక్కటయ్యారన్నారు. తిరుపతి ప్రజలంతా అభినయ్‌కే మద్దతుగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, పార్టీ నగర అధ్యక్షులు పాలగిరి ప్రతాప్‌రెడ్డి, నాయకులు కదిరి రా జేంద్ర, రాజేశ్వరి, మాధవనాయుడు పాల్గొన్నారు.



భూమనకు ఆత్మీయ స్వాగతం

బాబు మేనిఫెస్టో బూటకం



కందాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

ఏర్పేడు: చంద్రబాబు ప్రవేశపెట్టిన మేనిఫెస్టో అంతా బూటకమని.. ఆ మేనిఫెస్టోను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఆయన మంగళవారం మండలంలోని మునలిపేడు, సరస్వతీకండ్రిగ, రాచపాళెం, కందాడు, ఎస్సీ కాలనీ, రాజులకండ్రిగ, మడిబాక, పాయిల్ సెంటర్, చెల్లూరు, కుమ్మరికండ్రిగ, గుండ్లకండ్రిగ, కుక్కలగుంట వరకు ఎన్నికల ప్రచార రోడ్‌షో నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మరోసారి తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసులు, సర్పంచ్‌లు శ్రీదేవి,చెంగల్‌రాజు, సుబ్రమణ్యం, జయముని, మోహనప్రియ, మాజీ సర్పంచ్ వీరరాఘవరెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్యయాదవ్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శివయ్య, సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్దన్‌యాదవ్, మాజీ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, పార్టీ నాయకులు కందాటి ప్రభాకర్‌రెడ్డి, పారి నాగరాజు, లోకనాథరెడ్డి, అయోధ్య, ప్రభాకర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, చల్లా సుబ్రమణ్యం, చంద్రారెడ్డి, గోపీయాదవ్, మధుయాదవ్, జీపీ యాదవ్, మునికృష్ణారెడ్డి, పరమాల చంద్రశేఖర్, రుప్పాల వెంకటేష్, గాలి గుణశేఖర్ నాయుడు, గురునాథం, రవి యాదవ్, మణిరాజు, కేశవులురెడ్డి, రాంబత్తెయ్య, రాజులపాలెం రమేష్ పాల్గొన్నారు.



రాజులకండ్రిగలో కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

నారహంతకుడు!

- వృద్ధులు, వికలాంగులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదు
- జగన్ చేస్తున్న మంచిని ఓర్వలేకే కుట్రలు
- వెంకటగిరి ప్రచారంలో నేదురుమల్లి ధ్వజం



రోడ్ షోలో రెపరెపలాడుతున్న వైఎస్సార్‌సీపీ జెండాలు

వెంకటగిరి(సైదాపురం): 'ఎన్నికల వేళ నారా చంద్రబాబునాయుడు తన నిజ స్వరూపాన్ని బయట పెట్టారు. 55 నెలలుగా ఇంటి వద్దకే పాలన అందిస్తున్న విధానంపై కక్షగట్టారు. తన అనుచరుల ద్వారా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించారు. వలంటీర్ల వ్యవస్థను పక్కనబెట్టించారు. అంతటితో ఆగక అవ్వాతాతల చావుకు కారణమవుతూ రాక్షసానందం పొందుతున్నారు' అని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్రంలో పేద ప్రజలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న మంచిని ఓర్వలేక ప్రజల అనువులు కోరే నర హంతకుడిగా తయారయ్యారని విరుచుకుపడ్డారు. వెంకటగిరి పట్టణంలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఈసందర్భంగా పట్టణ ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. అనంతరం నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు మంచి చేయాలన్న ఉద్దేశంతో సంక్షేమ పథకాలు గడపవద్దకే అందించిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. దీన్ని ఓర్వలేక చంద్రబాబునాయుడు పనిగట్టుకుని వృద్ధులు, దివ్యాంగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలను కాపీ కొట్టి ప్రజలకు మోసపూరిత మాటలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేసి జగనన్న సైనికులను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో వెంకటగిరి రాజా కుటుంబీకులు సర్వజ్ఞకుమారయాచేంద్ర, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకులు కొడవలూరు ధనంజయ్యరెడ్డి, సూళ్లూరుపేట అదనపు పరిశీలకులు కలిమిలి రాంప్రసాద్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, పట్టణ కన్వీనర్ జీ.ఢిల్లీబాబు, జిల్లా సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, న్యాయవాది ఎల్.కోటేశ్వరరావు, వైస్ చైర్మన్‌లు ఎస్.బాలయ్య, సీహెచ్ ఉమామహేశ్వరి, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

'గుడ్'మార్నింగ్

ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా మంగళవారం 'సాక్షి' బృందం సత్యవేడు నియోజకవర్గంలో విలేజ్ విజిట్ నిర్వహించింది. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఏడు మండలాలను సందర్శించింది. ఈ క్రమంలో ముందుగా బుచ్చినాయుడుకండ్రిగ మండలం, కుక్కంబాకం గ్రామం నుంచి రోడ్‌షో ప్రారంభమైంది. అక్కడి నుంచి బయలుదేరి వరదయ్యపాళెం మండలంలోని చిన్న పాండూరుకు.. అక్కడి నుంచి నియోజకవర్గ కేంద్రమైన సత్యవేడులోకి ప్రవేశించింది. ఆ తర్వాత సత్యవేడు–ఊత్తుకోట ప్రధాన రహదారి మీదుగా **నాగలాపురం** మండలంలోని కారణి గ్రామం**లోకి, ఆ** తర్వాత అదే మార్గంలో పుత్తూ**రుకు వెళ్లే** జాతీయ రహదారి మీదుగా **పిచ్చాటూరు** మండలంలోని గోవర్ధనగిరి గ్రా**మాన్ని** సందర్శించింది. అక్కడి నుంచి నారాయణవనం మండలం**లోకి ప్రవేశించి,** వెంకటకృష్ణపాళెం పంచాయతీ, **నాగిలేరు** గ్రామాన్ని సందర్శించి.. అక్క**డి నుం**చి వెనుదిరిగి పిచ్చాటూరు–శ్రీ**కాళ**హస్తి ప్రధాన రోడ్డు మార్గం**లోని కేవీ**బీపురం మండలంలోని పెరిందేశం గ్రామాన్ని సందర్శించింది. ఆయా గ్రామాలలో ఈ ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులపై ప్రజలను అడిగి తెలుసుకుంది. ..వారి మాటల్లోనే.

– వరదయ్యపాళెం


మత్తేరిమిట్ట గ్రామంలో నాడు–నేడు సొబగులు

ప్రగతి మెరిసే.. పల్లె మురిసే!

సత్యవేడు నియోజకవర్గంలో 'సాక్షి' విలేజ్ విజిట్

- **ఏడు మండలా**ల్లో పర్యటన
- **అభివృద్ధి పను**ల పరిశీలన
- **స్థానికుల అభి**ప్రాయాలను **సేకరించిన బృందం**

విలేజ్ వాచ్

చదువు విలువ తెలుసు కాబట్టే..!



చదువు విలువ తెలుసు కాబట్టే రాష్ట్ర ప్రభుత్వం ఈ ఐదేళ్లలో విద్యకు ప్రాధాన్యమిచ్చింది. నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు సమూలంగా మార్చేసింది. మా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను చూస్తే నమ్మలేకపోయా. అక్కడ కార్పొరేట్‌కన్నా మిన్నగా వసతులు సమకూర్చారు. ఇంత గొప్ప ఆలోచనతో ముందుకెళ్తున్న ప్రభుత్వానికే ప్రజల ఆశీర్వాదం ఉంటుందని నమ్ముతున్నా.

–ధర్మలింగం, సర్పంచ్, వీకేపాళ్యం, నారాయణవనం మండలం


నారాయణవనం మండలం, నాగిలేరులో రూ.18 లక్షలతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనం

ఊళ్లోనే నాణ్యమైన వైద్యం


పిచ్చాటూరు మండలం, గోవర్ధనగిరిలో రూ.17.5 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్



గత సంవత్సరం వరకు మా గ్రామంలో ఎటువంటి ఆస్పత్రి లేదు. జ్వరం, జలుబు వంటి చిన్నచిన్న రోగాలొచ్చినా ఏడు మైళ్ల దూరంలో ఉన్న పిచ్చాటూరు, నాగలాపురం మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. అయితే ఇప్పుడు ఆరోగ్యపరంగా ఏ సమస్య వచ్చినా వెంటనే వైఎస్‌ఆర్ హెల్త్ క్లినిక్‌కు వెళ్తే చాలు.. అక్కడే పరీక్షలు చేస్తున్నారు. ఉచితంగా మందులు, మాత్రలు కూడా ఇస్తున్నారు. ఇప్పుడు వైద్యం కోసం మేము ఎక్కడికీ వెళ్లాల్సిన పనిలేదు. పేదలకు ఇంత మంచి చేసిన ప్రభుతానికే మేమంతా అండగా ఉంటాం.

–వీ.లక్ష్మమ్మ, గోవర్ధనగిరి హరిజనవాడ, పిచ్చాటూరు మండలం


సత్యవేడులో రైతుల అవసరాలకు రూ.55 లక్షలతో ఏర్పాటు చేసిన అగ్రీ ల్యాబ్

పంట నష్టం తగ్గించుకోవచ్చు



పంట సాగుకు ముందే అగ్రీ ల్యాబ్‌లలో విత్తనాలు, ఎరువులను పరీక్షించే అవకాశాలు ఉండడం శుభపరిణామం. దీని వల్ల పంట నష్టాలను తగ్గించుకోవచ్చు. రైతులకు విత్తనాలు, ఎరువుల నాణ్యతపై పూర్తి అవగాహన ఏర్పడుతుంది. ఈ ఐదేళ్లు కష్టమంటే తెలియకుండా రైతులు బతికారు. అన్ని వేళలా అధికారులు, నాయకులు అందుబాటులో ఉండి ముందుకు నడిపించారు. ఇలాంటి ప్రభుత్వం మళ్లీ వస్తే బాగుంటుందని అనుకుంటున్నాను.

–వీ.రాము, మదనంబేడు. సత్యవేడు మండలం

మా ఊరి రోడ్డు మారింది




బుచ్చినాయుడుకండ్రిగ మండలం కుక్కంబాకం గ్రామంలో రూ.98 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన తారురోడ్డు

ఎన్నో ఏళ్లుగా కుక్కంబాకంకు వెళ్లాలంటే మట్టి రోడ్డుపై నడిచి వెళ్లేవాళ్లం. వర్షాకాలం వస్తే ఆ రోడ్డు మార్గంలో రాకపోకలు ఆపేసేవారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మా ఊరి రోడ్డు నిర్మాణానికి రూ.98 లక్షలు మంజూరైంది. ఏడాదిన్నర క్రితమే పూర్తి స్థాయిలో రోడ్డు నిర్మించారు. ఇప్పుడు ఏ ఇబ్బందీ లేదు.

–సుబ్రమణ్యం, స్థానికుడు, కుక్కంబాకం, బీఎన్‌కండ్రిగ మండలం

ఆ బాధలు లేవు



గతంలో ఎరువులు, పచ్చిరొట్ట విత్తనాలు తెచ్చుకోవాలంటే మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. అక్కడ ఎండకు, వానకు అవస్థలు పడేవాళ్లం. ఇప్పుడు గ్రామస్థాయిలో రైతుల మేలు కోరి రైతు భరోసా కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. అక్కడే రైతుకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు దొరుకుతున్నాయి. ఇంతటి గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ప్రభుత్వమే మళ్లీ రావాలి.

–మునికృష్ణయ్య, రైతు, కారణి, నాగలాపురం మండలం


నాగలాపురం మండలం, కారణి గ్రామంలో రూ.18 లక్షలతో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రం


కేవీబీపురం మండలం, పెరిందేశం గ్రామంలో రూ.75 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం

గ్రామ స్థాయిలోనే పౌరసేవలు



ఈ ప్రభుత్వం వచ్చిన మరుసటి రోజు నుంచే పరిపాలన పూర్తిగా మారిపోయింది. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం వచ్చింది. సచివాలయ వ్యవస్థ ద్వారా అన్ని పౌరసేవలు గ్రామస్థాయిలోనే అందుబాటులోకి వచ్చాయి. అవసరమైన సర్టిఫికెట్లు నిమిషాల్లో చేతిలోకి వస్తున్నాయి. చాలా సంతోషంగా ఉంది

–బొబ్బిలి, పెరిందేశం, కేవీబీపురం మండలం


వరదయ్యపాళెం మండలం చిన్న పాండూరులో రూ.1.87 కోట్లతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

అద్భుతం



ప్రస్తుత ప్రభుత్వంలో గ్రామీణ స్థాయిలో వైద్యసేవలు అందించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి పెద్దపీట వేశారు. ఆ దిశగా మా చిన్న పాండూరు గ్రామంలో రూ.1.87 కోట్లతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్యసేవలు అందుకుంటున్నాం. ఇది చాలా అద్భుతంగా ఉంది.

–వెంకటేష్, స్థానికుడు, చిన్న పాండూరు, వరదయ్యపాళెం మండలం

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు


వెంకటగిరి : పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి రూరల్: మండలంలోని చెలికంపాడు గ్రామానికి చెందిన 20 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షులు కాల్తిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, సర్పంచ్ వెంకటరణమ్మ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో 50 కుటుంబాల చేరిక

నాయుడుపేట టౌన్: పట్టణంలోని సంజయ్‌గాంధీ కాలనీలో స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కాకు జగదీష్‌రెడ్డి సారథ్యంలో 50 కుటుంబాలు సోమవారం రాత్రి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. ఎమ్మెల్యే అభ్యర్థి సంజీవయ్య సతీమణి కిలివేటి సుభాషిణి అక్కడి నాయకులు కామిరెడ్డి మోహన్‌రెడ్డితో కలిసి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఆ పార్టీలో ఇమడలేం

నారాయణవనం: మండలంలోని అరణ్యంకండ్రిగ పంచాయతీకి చెందిన ఇద్దరు యువకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కాగా రెండు వారాల క్రితం పంచాయతీ పరిధిలోని కప్పలమాదిగ ఇళ్లకు చెందిన సురేష్, జీఎస్ కండ్రిగకు చెందిన సురేష్ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేటి ఆదిమూలం ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. తిరిగి వారు సోమవారం రాత్రి వైఎస్సార్‌సీపీలో చేరారు. టీడీపీలో ఇమడలేకే మళ్లీ వైఎస్సార్‌సీపీలో చేరినట్టు వారు పేర్కొన్నారు. అరణ్యంకండ్రిగ ఉప సర్పంచ్ మురళి, మాజీ వైస్ ఎంపీపీ వెంకటేష్, నాయకులు ఆపిల్, కార్తవరాయన్ పాల్గొన్నారు.


పార్టీలో చేరిన మహిళలకు కండువాలు కప్పుతున్న కిలివేటి సుభాషిణి


నారాయణవనం: పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి రాజేష్

కేశవులురెడ్డికి ప్రతిష్టాత్మక అవార్డు

తిరుపతి సిటీ : ఎస్వీయూ కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ఈ.కేశవులురెడ్డికి ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. అహ్మదాబాద్‌కు చెందిన గ్లోబల్ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ నుంచి ఎక్సలెన్సీ అవార్డు–2024ను అందుకున్నారు. 17 ఏళ్లుగా అకాడమీ వర్క్, రీసెర్చ్, ఇన్నోవేషన్స్, ఎక్స్‌ట్రా కరికులమ్ యాక్టివిటీస్‌లో చురుకైన పాత్ర పోషించడంతో ఆయనకు ఈ అవార్డు దక్కింది. ఈ సందర్భంగా మంగళవారం వీసీ శ్రీకాంత్‌రెడ్డి ఆయనను అభినందించారు.


ప్రొఫెసర్ కేశవులురెడ్డిని అభినందిస్తున్న వీసీ శ్రీకాంత్‌రెడ్డి

విద్యుత్ షాక్‌తో చిన్నారి మృతి

– మరో చిన్నారికి తీవ్ర గాయాలు

చిల్లకూరు : తండ్రితో కలిసి గొర్రెలు మేపేందుకు వెళ్లిన ఓ చిన్నారిని విద్యుత్ తీగ బలిగొంది. మరో చిన్నారిని గాయాలు పాలు చేసింది. ఈ విషాద సంఘటన మంగళవారం తీర ప్రాంతంలోని బకింగ్ హాం కెనాల్‌కు అవతలి వైపున చోటుచేసుకుంది. స్థానికుల వివరాలు.. మండలంలోని తీర ప్రాంత గ్రామమైన తూర్పుకనుపూరు పంచాయతీలోని ఈదులవారిపాళెం గ్రామానికి చెందినసిద్ధయ్య, ముత్యాలయ్య అనే గిరిజన కుటుంబాల వారికి గొర్రెలు ఉన్నాయి. వాటిని మేపుకునేందుకు గ్రామానికి సమీపంలో ఉన్న బకింగ్‌హాం కెనాల్‌కు అవతలి వైపు వెళ్తుంటారు. ఈ క్రమంలో ఇద్దరి కుమారులు మునేంద్ర(8), సతీష్(9) కూడా వారితో వెళ్లారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో చిన్నారులిద్దర్నీ ఇంటికి వెళ్లమని తండ్రులు వారికి నచ్చజెప్పారు. చిన్నారులిద్దరూ ఇంటికి వచ్చే క్రమంలో కాలువకు దగ్గరగా ఉన్న 11 కేవీ విద్యుత్ తీగ తెగిపడి ఉండడంతో గుర్తించక దానిపై కాలు వేశారు. మునేంద్ర అక్కడికక్కడే కాలిపోయి మృతి చెందగా సతీష్‌కు కాళ్లు కాలి పోయి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ప్రమాదాన్ని గమనించి ఇద్దరు తండ్రులు సంఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపిస్తూ ఇద్దరు బిడ్డలను ఇంటికి చేర్చారు. ఆపై తీవ్రంగా గాయపడిన సతీష్‌ను ఆస్పత్రికి తరలించారు. మునేంద్ర మృతదేహం వద్ద కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. దీనిపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు. విద్యుత్ తీగ తెగిపడిన విషయమై ఆ శాఖ ఏఈని వివరణ కోరగా.. తమకు కూడా సమాచారం అందిందని, వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు.

టీడీపీలో భగ్గుమంటున్న విభేదాలు

సైదాపురం: సైదాపురం మండలంలో టీడీపీ నేతల మధ్య రోజురోజుకు విభేదాలు తార స్థాయికి చేరుకుంటున్నాయి. ఇటీవలే పార్టీలో చేరిన నేత వల్ల మరిన్ని వివాదాలు చెలరేగుతున్నాయి. మండలంలోని మర్లపూడి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి టీడీపీలో వర్గ పోరు భ్రుతిమించింది. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ ఎదుటే టీడీపీ జెండాలను తగలబెట్టిన విషయం విధితమే. ఈ విషయం మరువకముందే సోమవారం ఓ నేత ఇంటి వద్ద రామసాగరం నేతల మధ్య తీవ్ర స్థాయిలో వివాదాలు చెలరేగాయి. ఈ క్రమంలోనే రామసాగరం పంచాయతీ పరిధిలో మంగళవారం రాత్రి మాజీ ఏఎంసీ చైర్మన్ బీ మస్తాన్ నాయుడు, మాజీ సర్పంచ్ సుబ్రమణ్యం నాయుడు మధ్య వివాదం చోటు చేసుకుంది. దీంతో మనస్తాపం చెందిన మాజీ ఏఎంసీ చైర్మన్ బీ.మస్తాన్‌నాయుడితో పాటు గ్రామ టీడీపీ అధ్యక్షుడు జనార్ధన్‌నాయుడు, బూత్ కమిటీ కన్వీనర్ కురుగొండ ఈశ్వరయ్యతో పాటు ఆయన అనుచరులు సుమారు 500 మంది టీడీపీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఇది మండలంలో చర్చనీయాంశమైంది.

ఈత.. కడుపు కోత

- ఈతకు వెళ్లి బాలుడి మృతి
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు

చంద్రగిరి: ఈతకు వెళ్లి బాలుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని యల్లంపల్లి చెరువులో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు.. భీమవరం గ్రామానికి చెందిన ప్రవీణ్(16) తన అమ్మమ్మతో ఉంటున్నాడు. మంగళవారం మధ్యాహ్నం ప్రవీణ్ మరికొంత మంది స్నేహితులతో కలసి యల్లంపల్లిలోని చెరువులో ఈతకు వెళ్లాడు. ఈ క్రమంలో చెరువులో ఈత కొడుతూ ప్రమాదవశాత్తు ప్రవీణ్ నీట మునిగాడు. ఎంతకీ బయటకు రాకపోవడంతో తోటి స్నేహితులు గ్రామస్తులకు సమాచారం అందించారు. అనంతరం గ్రామంలోని గజ ఈతగాళ్లు ప్రవీణ్ కోసం గాలించినా ఫలితం లేకపోయింది. సుమారు 3 గంటల పాటు శ్రమించి ప్రవీణ్ మృతదేహాన్ని బయటకు తీశారు. తమ కళ్లెదుటే బిడ్డ మృతి చెందడంతో గ్రామస్తులు బోరున విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.